

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య తదితరులు

డ్రగ్స్ నుంచి యువతను కాపాడదాం

చిక్కడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నుంచి యువతను కాపాడదామని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లో డ్రగ్స్, గంజాయి, కొకైన్ తదితర మత్తు పదార్థాలకు చెక్ పెడదామన్నారు. ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయిని నివారణకు చర్యలు తీసుకోవాలని రూపొందించిన పోస్టర్‌ను ఇన్‌స్పెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ మాట్లాడుతూ.. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవికుమార్, బీఎస్ కృష్ణ, ముషీరాబాద్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాయని భర్తకు టీసీడబ్ల్యూఎస్ ఆర్థికసాయం

చిక్కడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని సాయిపావని భర్త ఎర్రోళ్ళ సురేష్ కొన్నినెలలుగా మెదడువాపు వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం విరాళాల కోసం తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ(టీసీడబ్ల్యూఎస్) త్యాగరాయగానసభలో ఇటీవల సంగీత కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, గాయనీగాయకులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదరగుప్తా, సామాజిక కార్యకర్త గణేశ్ పటేల్ విరాళాలు ప్రకటించారు. రూ. 1,40,000 సొసైటీ నిర్వాహకులు సాయి పావనికి అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నల్లగొండకు చెందిన కళాకారుడు వెంకటేష్‌కు రూ. 20 వేలు అందజేశారు.

పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్

రాంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి. బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయ్ పాపన్న జయంతిని ఈనెల 18న అధికారికంగా నిర్వహించాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని కోరారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాపన్న జయంతిని ఈనెల 16న చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

గోడకూలిన ఘటనలో గాయపడిన కార్మికులు సురక్షితం

ముషీరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో గోడకూలిన ఘటనలో గాయపడిన ఇద్దరు కార్మికులు సురక్షితంగా ఉన్నారు. మంగళవారం రాత్రి ఇందిరానగర్‌లో మసీదు నిర్మాణ పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి తీస్తుండగా పక్కనే ఉన్న గోడ కూలి ఒడిశాకు చెందిన అలోక్, మింటుపై పడడంతో గాయపడిన విషయం తెలిసిందే. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మింటును బుధవారం డిశ్చార్జి చేశారు. అలోక్‌కు ప్రమాదం లేదని, త్వరలో డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.



గరిమెళ్ల సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న దామోదరగుప్తా, జనార్దనమూర్తి తదితరులు

బ్రిటిష్ పాలనను ధిక్కరించిన సాహితీ యోధుడు గరిమెళ్ళ

చిక్కడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలనను కలాన్ని ఆయుధంగా మార్చి ధిక్కరించిన సాహితీయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గరిమెళ్ల తన సాహిత్యంతో నాటి దొరల పాలనపై పోరాటం చేశారని అన్నారు. ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు మాట్లాడుతూ.. 'మా కొద్దీ తెల్ల దొరతనం' అనే గీతంతో ప్రసిద్ధి చెందిన గరిమెళ్ల జీవితాంతం స్వాతంత్ర్య కోసమే తపించారని గుర్తు చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, గాయని రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలను నిలిపివేయాలి



ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్‌రావు, చిక్కా దేవదాసు

గోల్నాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలను నిలిపివేయాలని గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కా దేవదాసు కోరారు. ఈ మేరకు పద్మాశాలి సంఘం ఎన్నికల అధికారి భువనగిరి ఉదయకుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం బైలాస్‌కు వ్యతిరేకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సంఘం ఎన్నికలను చట్టప్రకారం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ కుత్బిగూడ వాల్మీకినగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను పెంపొందించాలి



తిరంగా ర్యాలీలో ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): యువతలో జాతీయ సమైక్యతను పెంపొందించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బర్కత్‌పుర చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి ఆర్.కృష్ణయ్య భారత్ మాతాకీ జై, జై కిసాన్ జై జవాన్ అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పైకి మాత్రం దేశ సమైక్యత, సమగ్రత, ఐక్యత అంటూ మాట్లాడుతున్నారని, కానీ అందరినీ సమానంగా చూడడం లేదని ఆరోపించారు. అదానీ, అంబానీలకు అండగా నిలుస్తూ దేశ సంపదను ఉత్పత్తి చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాన్ని విడనాడి జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, ఉదయ్‌నేత, పగిళ్ల సతీష్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా యాత్ర

రాంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాతిరి పార్థసారథి పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో తిరంగా యాత్ర నిర్వహించి ఇంటింటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, జ్యోతి, సూర్యచందర్, నర్సింహ, రాజు, జగదీష్‌నాయీ, భాగ్య హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్‌లో తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, జమాల్‌పురి నందు, సురేష్ ముదిరాజ్, గంట శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాతిరి పార్థసారథి



హర్ ఘర్ తిరంగా యాత్రలో కార్పొరేటర్ కె రవిచారి, బీజేపీ నాయకులు



విగ్రహాలను శుద్ధి చేస్తున్న డా. లక్ష్మణ్, ఉమేష్

సమరయోధుల విగ్రహాల శుద్ధి

చిక్కడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ వారి విగ్రహాల శుద్ధి చేసే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలోగల అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ కడిగి, పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మెతుకు ఉమేష్, జాతీయ కార్యవర్గసభ్యుడు పూస రాజు, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి పవిత్రోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



పవిత్రోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

చిక్కడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జరగనున్న స్వామివారి పవిత్రోత్సవాల ఆహ్వానపత్రికను మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాక్సిన్



వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు

అంబర్‌పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. పటేల్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో బ్రెయిన్ ట్యూమర్ వ్యాక్సిన్‌ను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండేటి శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఎస్సీ మోర్చా నేతలు

దళితుల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

కవాడిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. బుధవారం కవాడిగూడలో చాయ్ పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సబ్ ఇన్‌చార్జి మీసాల విఠల్‌రావు, మహాకాళి జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజు, ఉపాధ్యక్షుడు ఇ. కృష్ణ, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి. పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో లంబాడీలకు ప్రాతినిధ్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్, అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ డిమాండ్ చేశారు. లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గాలను వారు ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా ఇందల్ రాథోడ్, గౌరవాధ్యక్షుడిగా మోతీలాల్ నాయక్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వెంకట్, ప్రధానకార్యదర్శిగా లోకేష్ నాయక్, కన్వీనర్‌గా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మహేందర్ నాయక్, బాలాజీ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్త్యా రమేష్ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డాన్ శ్రీనునాయక్, ఇన్‌చార్జిగా రోహిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా వినోద్ నాయక్, లక్ష్మణ్ పవార్, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్ నాయక్, రవీందర్, భాస్కర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని, సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కాచిగూడ రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో పోలీసుల తనిఖీలు



కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కాచిగూడ రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, రైళ్లలో నగరానికి వచ్చిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ చంద్రకుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐలు నరేష్‌కుమార్, కె. సుభాష్ పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న ఇద్దరికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎల్లప్ప

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి రైళ్లలో చోరీలు చేస్తున్న ఇద్దరు దొంగలను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ కర్నూల్ జిల్లా, ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు మాచెర్ల తిమ్మప్ప(33), ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం బీసీ కాలనీకి చెందిన రామకృష్ణ కుమారుడు తుప్పలపూడి సాయి రాఘవ(34) స్నేహితులు. మాచెర్ల తిమ్మప్ప క్యాటరింగ్ కార్మికుడిగా, సాయి రాఘవ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. జల్సాల కోసం రైళ్లలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి రూ. 90 వేల విలువగల 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రైల్వే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి ఆటో డ్రైవర్ మృతి

కవాడిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి భవనంపై నుంచి పడి మృతి చెందాడు. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ తాళ్లబస్తీలో సేరల రేణుబాబు(48) భార్య భాగ్య, ముగ్గురు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. రేణుబాబు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మంగళవారం రాత్రి ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. భాగ్యకు అనుమానం వచ్చి కుమారుడు సాయి పవన్‌ను పంపించగా వారి ఇంటి ఎదుట ఉన్న అమర్ ఇంట్లో రేణుబాబు మరో ఐదుగురితో కలిసి మద్యం తాగుతున్నాడు. పవన్ విషయాన్ని తల్లికి చెప్పాడు. అర్ధ రాత్రి 12.30 గంటల తర్వాత భవనం పై నుంచి ఓ వ్యక్తి కింద పడ్డాడని సమాచారం అందడంతో భాగ్య అక్కడికి వెళ్లి చూడగా రేణుబాబు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆస్ట్రేలియా పంపిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా పంపిస్తానని మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకులపై ఓ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కృష్ణాజిల్లా నందిగామకు చెందిన కర్నాటి అనూష 4-6-2023లో వెంగళరావునగర్‌లో ఆర్‌కే ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ మేనేజర్ అనుగుల మధుసూదన్‌ను సంప్రదించింది. అతడు ఆస్ట్రేలియా పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తానని చెప్పాడు. పనులు ప్రాసెస్ చేసేందుకు దశలవారీగా డబ్బు పంపమన్నాడు. దీంతో పాటు కాలేజీ ఫీజు, ఇన్సూరెన్స్, విమాన టికెట్ అంటూ రూ. 25 లక్షలు అడగడంతో ఆమె దశలవారీగా పంపించింది. ఆస్ట్రేలియా వెళ్లొచ్చని ఆమెకు పత్రాలు అందజేశాడు. ఆగస్టు 8వ తేదీన అనూష శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లింది. అధికారులు ఆమె వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి నకిలీవని చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

మల్కాజిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన భార్య ఆత్మహత్య చేసుకుంది. మల్కాజిగిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ముఖ్రం, రేష్మాబేగం(28) భార్యాభర్తలు. వీరికి గత ఏడాది వివాహం అయింది. ఒక బాబు ఉన్నాడు. ముఖ్రం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. భార్యభర్తలు మంగళవారం రాత్రి గొడవపడ్డారు. బుధవారం ఉదయం చూసేసరికి రేష్మా బేగం బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉంది. అదనపు కట్నం కోసం భర్త వేధించడం వల్లే రేష్మ ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేశ విభజనతో అనేకమంది నిరాశ్రయులయ్యారు

● ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

బర్కత్‌పుర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాలమైన భారతదేశాన్ని విభజించడంతో అనేకమంది భారతీయులు నిరాశ్రయులయ్యారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సెంట్రల్ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రిటీష్ పాలనలో దేశం అన్ని రంగాల్లో అణచివేతకు గురైందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ నేతలకు సూచించారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మాజీ మంత్రులు కృష్ణాయాదవ్, ప్రేంసింగ్ రాథోడ్, నాయకులు ఆనంద్‌గౌడ్, కృష్ణాగౌడ్, నందకిషోర్ యదవ్, కన్నె రమేష్, వనం రమేష్, అడప చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

రాంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగే జనగణనలో భాగంగా సమగ్ర కులగణన చేపట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానం బుధవారం నిర్వహించిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు. సమగ్ర కులగణన కోసం వారంరోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల మేధావులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో బీసీ కులసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజ్‌గౌడ్, నాయకులు అయిలి వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ మాదేశి రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రభుత్వ రంగాన్ని కాపాడాలి

రాంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో పోరాడదామని జన జాగరణ కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఆర్టీసీ కల్యాణ మండపం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, ఎరువుల సబ్సిడీకి నిధులు పెంచాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, నినాదాలు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు టి.సాగర్, పాలడుగు భాస్కర్, బాల్‌రాజ్, రెబ్బ రామారావు, శివబాబు, ఆర్‌టీ చంద్రశేఖర్, అమ్జద్‌ఖాన్, సూర్యం, అనురాధ, జె.వెంకటేశ్, యం వెంకటేశ్, బొప్పని పద్మ మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన అందరికీ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు మోహన్, మహేందర్ ప్రదీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.